క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


మహబూబ్‌చాంద్ తహసీల్దార్

సుండుపల్లె : మండల తహసీల్దార్‌గా ఎస్.మహబూబ్ చాంద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్ రావు ఉత్తర్వుల మేరకు ఆమె రైల్వేకోడూరు నుంచి సుండుపల్లెకు బదిలీ అయ్యారు.

రైల్వేకోడూరు ఏఓగా సందీప్



రైల్వేకోడూరు అర్బన్ : మండల వ్యవసాయశాఖ అధికారిగా సందీప్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిట్వేలి మండలంలో విధులు నిర్వర్తిస్తూ రైల్వేకోడూరుకు బదిలీపై వచ్చారు. రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, పథకాలు అందరికీ అందేలా చూస్తానని తెలియజేశారు.

తహసీల్దార్‌గా అమర్నాథ్



రైల్వేకోడూరు అర్బన్ : మండల తహసీల్దార్‌గా అమర్నాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నిమ్మనపల్లిలో విధులు నిర్వహిస్తూ బదిలీపై కోడూరుకు వచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతామని వారు పేర్కొన్నారు.

లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ అధికారిగా రాజకుమారి



లక్కిరెడ్డిపల్లి : మండల వ్యవసాయ అధికారిగా రాజకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఏఓ రాజకుమారి బదిలీపై కడప నుంచి లక్కిరెడ్డిపల్లికి వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న రమేష్ బాబురావు బదిలీపై రాయచోటికి వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ రాజకుమారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తన కాయల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

పార్వతీపురంలో 'పల్లె నిద్ర'



సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురంలో ఆదివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేట్టామని సిద్దవటం ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ చోరీల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, గ్రామస్తులు ఇండ్లకు తాళాలు వేసి దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపామన్నారు. అనుమానిత వ్యక్తులు గ్రామంలో ఎవరైనా కనబడితే పోలీసులకు తెలియజేయాలని గ్రామస్తులకు సూచించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు


సుండుపల్లె : గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని మండలంలోని వీఆర్ఏలు తహసీల్దార్ మెహబూబ్‌చాంద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వినతి పత్రంలో వీఆర్ఏలకు కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని, అర్హత ఉన్న వీఆర్ఏలను వీఆర్ఓలు, అటెండర్లుగా పదోన్నతి ల్పించాలని వారు కోరారు. ఈ నెల 25న గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలో ధర్నాకు అంగీకరించాలని వినతిపత్రంలో విన్నవించారు.

ముమ్మరంగా అడ్మిషన్లు


హైస్కూల్‌లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు

పెనగలూరు : మండలంలోని చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ముమ్మరంగా అడ్మిషన్లు జరుగుతున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల కోసం క్రమశిక్షణతో కూడిన విద్యా వసతులు కల్పిస్తున్నామని తెలియజేశారు. చక్రంపేట పరిసర గ్రామాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను చక్రంపేట హైస్కూల్‌లో చేర్పించాలని ఆయన కోరారు.

పెనగలూరు ఏపీఓ మృతి


ఉమామహేశ్వర్ (ఫైల్)

పెనగలూరు : మండల ఏపీఓగా పనిచేస్తున్న ఉమామహేశ్వర్ అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏపీఓ మృతిపట్ల ఎంపీడీఓ విజయారావు, ఉపాధి హామీ సిబ్బంది తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

చిన్నారుల 'భవిత'కు అండగా..

- ప్రత్యేక అవసరాల పిల్లల కోసం భవిత కేంద్రాలు
- ఉచిత శిక్షణతోపాటు పరికరాల అందజేత
- చిన్నారుల్లో మనోధైర్యం నింపుతున్న ఐఈఆర్‌పీలు


భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చేస్తున్న ఐఈఆర్‌పీ

రాయచోటి జగదాంబ సెంటర్ : మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతున్న చిన్నారులకు, వారి తల్లులకు మేమున్నామంటూ మనోధైర్యాన్ని నింపుతున్నారు భవిత కేంద్రంలో పనిచేసే ఐఈఆర్‌పీలు. ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ప్రభుత్వం మండలానికి ఒక భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసిది. ఈ కేంద్రాల్లో ఇద్దరు చొప్పున ఐఈఆర్‌పీలు పని చేస్తున్నారు. వీరు చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. తల్లిదండ్రులకు ఇతోధిక సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఐఈఆర్‌పీ (ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్స్)ల ద్వారా సర్వేలు నిర్వహించి ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి వారికి చక్కటి భవిష్యత్తు కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది.

విద్యాబుద్ధులు నేర్పిస్తూ..

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణం బాలికల జూనియర్ కళాశాలలో భవిత కేంద్రం ఉంది. ఈ కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారికి శిక్షణ ఇస్తున్నారు. భవిత కేంద్రాలకు వచ్చే పిల్లలకు సమగ్ర శిక్ష ద్వారా విద్యార్థి దశలోనే మానసిక దివ్యాంగులకు విద్యాబుద్ధులు నేర్పించడం, ఫిజియోథెరపీ చేయించడం, వారికి అవసరమైన పరికరాలు అందించడంతో పాటు వారి పనులు వారే స్వయంగా చేసుకునేలా తీర్చిదిద్దుతున్నారు. గుర్తించిన పిల్లల వయస్సులతో పాటు వారి పరిస్థితిని అంచనా వేసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. అలా కాకుండా తగిన తర్ఫీదు, వివిధ సేవలు అవసరమున్న వారిని ముందుగా భవిత కేంద్రంలో చేర్చుకుంటారు. వీరికి స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, చిన్నతనంలోనే దివ్యాంగత్వాన్ని గుర్తించి తగిన కృత్యాలను రోజువారీ కార్యక్రమాలను పిల్లలకు నేర్పిస్తారు. ఇలా వారంలో ఐదు రోజుల పాటు సేవలందించిన ఐఈఆర్‌పీలు పిల్లల ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రుల సమక్షంలో ఫిజియోథెరపీతో పాటు శిక్షణ ఇస్తారు.

చైల్డ్ అలవెన్స్‌లు అందజేస్తూ..

ప్రత్యేక అవసరాల పిల్లలకు మూడు రకాల అలవెన్స్‌లు ప్రభుత్వం అందిస్తోంది. బడికి వచ్చే మానసిక, బుద్ధిమాంద్యం ఉన్న వారికి ఇంటి వద్దే ఉన్న వారికి, ఆడపిల్లలకు ప్రత్యేక గర్ల్స్ చైల్డ్ అలవెన్స్ పేరిట నెలకు రూ.300 వంతున పది నెలలకు రూ.3 వేలను వారి తల్లుల ఖాతాల్లో ఏడాదికి ఒకే సారి జమ చేస్తోంది. పిల్లలకు అవసరమైన సామగ్రి అందించడతో పాటు బడికి వచ్చే పిల్లలకు యూనిఫాం, పుస్తకాలు, టై, బెల్ట్ అందిస్తున్నారు.


ప్రత్యేకావసరాల పిల్లల వివరాలు సేకరిస్తున్న దృశ్యం

కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ



భవిత పాఠశాలలో ఐఈఆర్‌పీగా పని చేయడం పిల్లలకు చేస్తున్న సేవ ఒక భాగ్యంగా భావిస్తున్నా. మాటలు రాని పిల్లలకు మాట్లాడేందుకు, వారి పనులు వారే చేసుకునేలా శిక్షణ ఇస్తున్నాం. పిల్లలకు మేం ఇస్తున్న శిక్షణను తల్లిదండ్రులు సైతం ఇంటి వద్ద కొనసాగించాలి. అప్పుడే పిల్లలు త్వరితగతిన మెరుగవుతారు. ఇందుకు తల్లిదండ్రులు తరచూ భవిత పాఠశాలకు వచ్చి తాము ఇచ్చే సలహాలు, సూచనలు స్వీకరించాలి.

– గోరంట్ల జనార్దన, ఐఈఆర్‌పీ, భవిత కేంద్రం, రాయచోటి

ముందుగా సమస్య గుర్తిస్తే..



భవిత కేంద్రం ద్వారా ఎక్కువ మంది ప్రయోజనం పొందుతున్నారు. వారు వైద్య, రవాణా ఖర్చులు భరించాల్సిన అవసరం లేదు. మేము నేర్పిన అంశాలు, శిక్షణను తల్లిదండ్రులు క్రమం తప్పకుండా ఇంటి వద్ద చేయించాలి. అప్పుడే ప్రయోజనం ఉంటుంది. సమస్య ఉన్న పిల్లలను తొందరగా గుర్తించి శిక్షణ ప్రారంభిస్తే మంచిది. ఐఈఆర్‌పీలకు తల్లిదండ్రులు సహకరించి సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పి.రవిచంద్రప్రసాద్, ఐఈఆర్‌పీ, సంబేపల్లె

పిల్లలకు అండగా భవిత కేంద్రాలు



భవిత కేంద్రాలు ప్రత్యేక అవసరాల పిల్లలకు అండగా ఉన్నాయి. ఈ కేంద్రంలో పిల్లలకు ఉచిత శిక్షణతో పాటు ఉచిత ఫిజియోథెరపీని అందజేస్తున్నాం. ప్రత్యేక అవసరాల పిల్లలకు కావాల్సిన పరికరాలను అందించేందుకు కృషి చేస్తాం. వారి పనులు వారు చేసుకోవడమే కాక భవిష్యత్తులో రాణించేలా స్ఫూర్తి కలిగించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను విద్యార్థులకు అందిస్తూ బాసటగా నిలుస్తున్నాం.

– పి.జమాలుల్లాఖాన్, ఐఈఆర్‌పీ, రామాపురం

ఎంపీ మేడా నిధులతో నీటి బోరు ఏర్పాటు


చేనేత కాలనీలో బోరు వేస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలోని చేనేత క్లస్టర్ సమీపంలో ఉన్న మేడా రామక్రిష్ణారెడ్డి పద్మశాలి చేనేత కాలనీలో ఎంపీ మేడా రఘునాథ్‌రెడ్డి (రాజ్యసభ సభ్యులు) రూ.2.50 లక్షల నిధులతో తాగునీటి కోసం బోరు ఏర్పాటు చేశామని వైఎస్ఆర్‌సీపీ సిద్దవటం మండల చేనేత క్లస్టర్ విభాగం అధ్యక్షుడు శ్రీరామదాసు వెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ మేడా రామక్రిష్ణారెడ్డి పద్మశాలి చేనేత కాలనీలో గతంలో ప్రభుత్వం 80 ఇండ్లు మంజూరు చేశారన్నారు. అక్కడ కొందరు గృహ నిర్మాణలు చేపడుతున్నారని, మరికొందరు నివాస గృహాలను ఏర్పాటు చేసుకొని కాపురం ఉన్నారన్నారు. అయితే కాలనీ వాసులకు నివాస గృహాలను నిర్మించుకునేందుకు, తాగునీటి సౌకర్యం కోసం ఇక్కడ వేసిన బోరు నీరు ఎంతో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

పెనగలూరు : పెనగలూరు వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. పన్నెండు రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతిరోజూ హరికథ కాలక్షేపంతో పాటు రోజుకొక సేవతో ఊరేగింపు కార్యక్రమాన్ని జరిపించినట్లు ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్య, గ్రామ పురోహితులు చెంచు సుగుణ, శైలు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

తాళ్లపాక నుంచి తిరుమలకు బస్ సౌకర్యం కల్పించాలి


తిరుమలకు బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరుతున్న కేఎంఎల్ నరసింహ

రాజంపేట : పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి నుంచి నేరుగా తిరుమలకు బస్ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరిని కోరామని ఆల్ ఇండియా నేషనల్ ఓబీసీ ఫ్రంట్ కన్వీనరు కేఎంఎల్ నరసింహులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టరును కలిసి వినతిపత్రాన్ని అందజేశామన్నారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వస్వామిపై 32 వేల కీర్తనలు రాసిన అన్నమయ్య జన్మస్థలి నుంచి గతంలో తిరుమలకు నేరుగా బస్ సౌకర్యం ఉండేదన్నారు. ఆ తర్వాత ఆ సర్వీసును ఆర్టీసీ తొలగించేసిందన్నారు. తిరుమలకు వచ్చే యాత్రికులు ఒక శాతమైన తాళ్లపాకకు వచ్చేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. తిరుమల – తాళ్లపాక మధ్య బస్ సౌకర్యం కల్పిస్తే కచ్చితంగా పర్యాటకులు, యాత్రికులు రాక పెరుగుతుందన్నారు. కలెక్టరు వెంటనే స్పందించి ఆర్టీసీ ఉన్నతాధికారిని పిలిపించి, తాళ్లపాక నుంచి తిరుమలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. తిరుపతి వరకు అయితే బస్సు సౌకర్యం కల్పించేందుకు వీలవుతుందని కలెక్టర్‌కు వివరించగా, తాళ్లపాక నుంచి తిరుమల వరకు నడిపించే పరిస్థితిపై పరిశీలించాలని తాను కోరుతున్నట్లు వివరించారు.

విత్తన కాయలు సకాలంలో పంపిణీ చేయాలి


వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు


లక్కిరెడ్డిపల్లి : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వేరుశనగ విత్తనకాయలు సకాలంలో అందించాలని లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని స్థానిక లక్కిరెడ్డిపల్లి టౌన్ సచివాలయంలో రైతులు, సిబ్బందితో కలిసి వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారి రాజకుమారి, ఉద్యాన అధికారి సింధూరిలతో కలిసి వారు మాట్లాడారు. రైతులకు వేరుశనగ విత్తన కాయలతోపాటు కందులు వంటి చిరుధాన్యాల పంటల విత్తనాలు అందజేసేలా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. నాణ్యమైన విత్తనాలను అందజేసేందుకు చొరవ చూపాలన్నారు. ముదురు మామిడి తోటల్లో కలుపు మొక్కల నివారణ చర్యలు చేపట్టేందుకు రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానశాఖ అధికారికి సూచించారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ ద్వారా ఉద్యాన రైతుకు కత్తెరలు, రంపాలు వంటివి అందజేయాలన్నారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సర్పంచ్‌లు వెంకటనారాయమ రెడ్డి, చెంద్రాయుడు, ఎంపీటీసీ సభ్యులు దస్తగిరి, లక్ష్మీనారాయణ, సుబ్బరాయుడు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు విద్య అందించాలన్నదే సుగవాసి సంకల్పం


పాలకొండ్రాయుడు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

రాయచోటి టౌన్ : మా తండ్రి సుగవాసి పాలకొండ్రాయుడు ఎంపీగా, ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం రాయచోటిలో విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చాడని ఆయన కుమారుడు టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని మాసాపేటలోని సుగవాసి రాజారాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివంగత ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రసాద్‌బాబు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మారుమూల ప్రాంతంగా ఉన్న రాయచోటిలో నాణ్యమైన విద్యకు నోచుకోకపోవడంతో తన తండ్రి పేదలకు నాణ్యమైన విద్య అందించాలని అప్పటి ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఐదు ఎకరాల స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతో పాటు రూ.5లక్షలు డబ్బులు విరాళం అందించాడని చెప్పారు. అందుకు తగ్గట్టుగానే ఇక్కడ పని చేసే ఉపాధ్యాయులు అహర్నిశలు శ్రమించి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించి ఎందరో ఐఏఎస్, ఐపీఎస్, ఎంబీబీఎస్, ఇంజనీర్లగా తయారు చేశారని చెప్పారు. కార్యక్రమంలో సుగవాసి శ్రీనివాసులు, సుగవాసి విద్యాధర్, సుగవాసి జానకిరామ్, సుగవాసి ఆనంద్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి నాగేంద్ర, సుగవాసి శ్యామ్‌కుమార్, కాంశెట్టి గిరి, సి.గోపాల్ కృష్ణయ్య, ఎం.రామాంజనేయులు, బడిశెట్టి రవి, బండికింద మనోహర్, వాకా వాసు, కొండేటి సహదేవ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయండి


ఎమ్మెల్యే ఆకేపాటిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాజంపేట రూరల్ : ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి సూచించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు మందపల్లి హైస్కూల్‌లో నూతన హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించిన ఎంవీ రమణమూర్తి తన అధ్యాపక బృందంతో సోమవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం ఎమ్మెల్యే ఆకేపాటిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే ఆకేపాటికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు ఆకేపాటి కోరారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివశంకర్‌రాజు, ఎం.నారాయణ, డి.అశోక్‌కుమార్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పథకాలు వర్తింపజేయాలి

లక్కిరెడ్డిపల్లి : అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు సుకుమారి పేర్కొన్నారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలుగా గౌరవ వేతనం తీసుకుంటున్నామని, తాము ప్రభుత్వ ఉద్యోగులం కాదని, అయినప్పటికీ ప్రభుత్వం వారు అందించే సంక్షేమ పథకాలు తమకు అందడం లేదన్నారు.

ఎందుకని సచివాలయంలో అడిగితే తమను ప్రభుత్వ ఉద్యోగులుగా సిబ్బంది చెబుతున్నారని, తాము గౌరవ వేతనం తీసుకునే కార్మికులు మాత్రమే అని, కావున తమకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శ్రావణి, నాగమణి, శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీపీఎం కృష్ణయ్య సేవలు ఎనలేనివి


కృష్ణయ్యను సన్మానిస్తున్న సేవా సంఘం సభ్యులు

రాయచోటి జగదాంబ సెంటర్ : బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా కృష్ణయ్య ప్రజలకు ఎంతో సేవ చేశారని ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ గడికోట చెన్నారెడ్డి తెలిపారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ప్రజా చైతన్య సేవా సంఘం కార్యాలయంలో చిన్నమండెం మండలం చాకిబండ బీపీఎంగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన కృష్ణయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి మాట్లాడుతూ తన సర్వీస్‌లో ఎక్కడా ఎలాంటి తప్పు లేకుండా ప్రజలకు సేవలు అందిస్తూ చిన్న మొత్తాల పొదుపులు, ఆర్‌పీఎల్ఐ, సుకన్యా సమృద్ధి యోజన, టైం డిపాజిట్ తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తపాలా శాఖ ఆర్థిక అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

నందలూరు : మైనర్లకు వాహనాలిస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం బస్టాండ్ కూడలిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా సరైన ధృవపత్రాలు కలిగి ఉండాలని తెలియజేశారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పుల్లంపేట : ఈ నెల 21వ తేది మండల వ్యాప్తంగా ప్రతి గ్రామ సచివాలయం వద్ద నిర్వహించే యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ ప్రసన్న కుమార్ కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అధికారి మాట్లాడుతూ యోగా ద్వారా ప్రజలు ఆరోగ్యంగా జీవించవచ్చని, ప్రతి ఒక్కరూ యోగా చేయడం వలన ఆరోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. ఈనెల 21న నిర్వహించే యోగా కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.జయశ్రీ, ఏఎస్ఓ శ్రీధర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

భూముల కబ్జాను అరికట్టండి


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు

ఓబులవారిపల్లె : మండలంలో కబ్జాలకు గురవుతున్న ఎస్సీ, ఎస్టీ దళితుల భూములను రక్షించాలని అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాలంరెడ్డి మల్లికార్జున తహసీల్దార్ యామినీని కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల భూములు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకొని కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకొని, అర్హులైన దళిత రైతులకు భూములు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ముత్యాల గాజుల శ్రీను, భారతీయ బహుజన సంఘ్ స్టేట్ జనరల్ సెక్రటరీ కె.లక్ష్మీనారాయణ, మోడీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద దళితులకు సాగు భూమివ్వాలి


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, దళితులు

గాలివీడు : మండలం పరిధి తూముకుంట దళితవాడలోని ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట 2 ఎకరాల సాగుభూమి కోసం ఆ గ్రామ దళితులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడులో ఇప్పటి వరకు తొమ్మిది అసైన్ కమిటీలు జరిగినా తూముకుంట దళితులకు ప్రాధాన్యత ఇవ్వక భూమి లేని నిరుపేదలుగా, గ్రామీణ శ్రామికులుగా జీవనం చేస్తున్నారని, మరి కొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారన్నారు. ఉన్న వారికి ఉపాధి పనులు లేక అర్ధాకలితో నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక వసుతుల కల్పనలో అధికారులు పాలకుల నిండు నిర్లక్ష్యంతో వెనుకబాటుతనానికి గురయ్యారని, అనేక మార్లు ప్రభుత్వ భూమి చదును చేసుకున్నా ఇతర అవసరాలకు ప్రభుత్వం కేటాయించి దళితులకు మొండిచేయి చూపారన్నారు. ఇప్పటికి వందల ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నా కాపాడే ధ్యాస అధికార యంత్రాంగానికి లేదన్నారు. స్మశానం స్థలంతో పాటు ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల భూమి ఇచ్చేంత వరకు దళిత కుటుంబాలకు అండగా సీపీఎం పార్టీ నిరవధిక ఉద్యమాలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, తూముకుంట దళితులు పాల్గొన్నారు.

బాబు డైరక్షన్‌లోనే విషపు కథనాలు

వైఎస్సార్‌సీపీపై ఆంధ్రజ్యోతి తప్పుడు కథనాన్ని ఖండించిన రైల్వేకోడూరు వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలపై ఆంధ్రజ్యోతి పత్రిక చంద్రబాబు, లోకేష్‌ల డైరక్షన్‌లో విషపు కథనాలను వండి వారుస్తున్నాయని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి మండిపడ్డారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం సొంత జిల్లా చిత్తూరుతోపాటు రాష్ట్రంలో పెద్దిరెడ్డి కుటుంబానికి ప్రజలలో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక సీఎం చంద్రబాబు, లోకేష్‌ల కుట్రలో భాగంగానే ఆంధ్రజ్యోతి తప్పుడు కథనాలకు తెరలేపిందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబ సభ్యులు మూడు తరాలు రాజకీయాలలో ఉంటూ అంచెలంచెలుగా ఎదిగారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎంపీ మిథున్‌రెడ్డిలను ఎదుర్కోలేక ఇలాంటి నీచమైన రాజకీయాలు పత్రికలను అడ్డు పెట్టుకొని చెడ్డపేరు వచ్చేలా వార్తలు రాస్తున్నారని చెప్పారు. ఉద్యోగాల పేరుతో మోసం చేసిన మహిళ వైఎస్సార్‌సీపీ నాయకులతో ఫొటోలు దిగినంత మాత్రనా వైఎస్సార్‌సీపీ అండతో అని రాయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. సదరు మహిళ మధురవాని భర్తకు ఎన్నారై టీడీపీ సభ్యత్వం ఉందని, అంటే ఆ మోసాల వెనుక చంద్రబాబు, లోకేష్‌లు ఉన్నారా అనేది అదే పత్రిక ప్రజలకు సమాధానమివ్వాలని ప్రశ్నించారు. వేధింపులు, కేసులు, పచ్చ పత్రికల్లో అసత్య కథనాలతో ఐదేళ్ల అధికారం వెల్లదీయాలని చంద్రబాబు చేస్తున్నా అనైతిక రాజకీయాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని, ఇప్పటికైనా అధికారం అందించిన ప్రజలకు మంచి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మండల నాగేంద్ర, సీహెచ్ రమేష్, సర్పంచ్‌లు హరికృష్ణారెడ్డి, గోపి, చంద్రశేఖర్, సుబ్రమణ్యంరాజు, చెంగల్‌రెడ్డిలు, వెంకటరెడ్డి, లక్ష్మీనారాయణమ్మ, తదితర నాయకులు పాల్గొన్నారు.

టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్‌లో విద్యార్థిని ప్రతిభ


నిఖితకు మెమెంటో, ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు, ప్రతినిధులు

సిద్దవటం : టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్‌లో దిగువపేట గాంధీ వీధికి చెందిన పాలెం నిఖిత అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటింది. విద్యార్థిని తండ్రి పాలెం బాబురామ్ సోమవారం మాట్లాడుతూ తిరుపతిలో ఆదివారం జరిగిన టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులకు సంఘం ప్రతినిధులు మెమెంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారి భవితకు మంచి పునాది ఏర్పడుతుందని ఆంధ్రప్రదేశ్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు తెలిపారు. కడప నగరానికి చెందిన గీత టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రాక్టిస్ చేసి పాలెం నిఖిత షార్ట్ హ్యాండ్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును సాధించారన్నారు. దీంతో అతిథులు విద్యార్థినికి షీల్డ్ బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏజీకే మూర్తి, ప్రతినిధులు పాల్గొన్నారు.

గో యజమానులకు పురపాలిక నోటీసులు


పండ్ల విక్రయదారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట : రాజంపేట పట్టణంలో నడిరోడ్లపై సంచరిస్తున్న పట్టించుకోని గోవులు యజమానులకు పురపాలక సంఘం ద్వారా నోటీసులు జారీ అందజేస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు వెల్లడించారు. సోమవారం పట్టణంలో రోడ్లపై సేదతీరుతున్న, సంచరిస్తున్న ఆవుల ఉన్న ప్రాంతాలల్లో కమిషనర్ పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు వీధుల్లో ఆవులు ట్రాఫిక్ అంతరాయం కలుగిస్తున్నాయన్నారు. ప్రజలకు ఇబ్బందులు పడటమే కాక ప్రమాదకర పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. వాహనదారులు సైతం ఆవుల వల్ల ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గోవులను యజమానులు తమ ఆ. దీనంలో ఉంచుకోవాలన్నారు. నిర్ణీత వ్యవధిలో చర్యలు తీసుకోని యజమానులకు జరిమానాలు విధిస్తామన్నారు. అప్పటికీ పట్టించుకోకుండా ఆవులను రోడ్డుపైకి వదిలివేస్తే వాటిని పట్టుకొని టీటీడీ గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.